క్లుప్తంగా

వర్షంతో ఊరట

గురజాల : నైరుతి ఋతుపవనాలు ప్రవేశించడంతో గురజాల పట్టణ పరిసర గ్రామాల్లో బుధవారం మధ్యాహ్నం నుంచి వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. మధ్యాహ్నం సమయంలో ఒక మోస్తారు నుంచి వర్షం కురిసింది. ఉదయం వేళ ఎండ తీవ్రత అధికంగా ఉండి ఉక్కపోతతో ఇబ్బందులు పడ్డారు. వాతావరణంలో ఒక్కసారిగా మార్పువచ్చి ఆకాశం మేఘావృతం కావడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. దీంతో పట్టణంలోని పలు రహదారులు తడిసి ముద్దయ్యాయి. ఈ వర్షంతో వేసవి ఎండల నుంచి ప్రజలు ఉపశమనం పొందారు.

జలమయంగా రహదారులు..

కురిసిన కొద్దిపాటి వర్షానికి రహదారులు జలమయమైయ్యాయి. దీంతో కాలువల్లో నీరు పొంగి పొర్లిపోయి రోడ్డుపైకి చేరాయి. దీంతో రహదారులు జలమైయమై పాదాచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఎంపీడీవో కార్యాలయం, ఎక్సైజ్ ఎన్ఫోర్సుమెంట్ కార్యాలయంలు వర్షపు నీరు చేరి తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి పథకాలు అందాలి



దాచేపల్లి : ప్రభుత్వం, ప్రజలకు మధ్య వారధుల్లా వలంటీర్లు పనిచేయాలని జెడ్పీటీసీ మూలగొండ్ల ప్రకాష్‌రెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వలంటీర్ల సమావేశం బుధవారం జరిగింది. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై వలంటీర్లతో చర్చించారు. ప్రభుత్వం ప్రజల కోసం అందిస్తున్న పథకాలు అమలు చేసే బాధ్యత వలంటీర్లపై ఉందని, అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి పథకాలు అందించి మన్నలను పొందాలని ప్రకాష్‌రెడ్డి చెప్పారు. ఎంపీడీవో ఎం. శోభారాణి మాట్లాడుతూ..వలంటీర్లు విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దని, సమర్థవంతంగా పనిచేయాలన్నారు. ఎక్కడ అవినీతి, లంచాలు లేకుండా నిస్వార్థంగా వలంటీర్లు పనిచేయాలని, ప్రజలతో సత్సంబంధాలు కలిగి ఉండాలన్నారు. ఈ సమావేశంలో ఈఓపీఆర్డీ జోషిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ సంఘాల ఆత్మీయ సమావేశం

మాచర్ల: నియోజక వర్గ స్థాయిలో ఉద్యోగ, ఉపాధ్యాయ వివిధ సంఘాల నేతలు, సభ్యులతో మాచర్ల మార్కెట్ యార్డులో శుక్రవారం సాయంత్రం జరిగే ఆత్మీయ సమావేశాన్ని జయప్రదం చేయాలని వైఎస్సార్ సీపీ మూడు జిల్లాల కో ఆర్డినేటర్ పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి కోరారు. బుధవారం సాయంత్రం ఆయన విలేకరులకు పత్రికా ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఉద్యోగ, వివిధ సంఘాల సమస్యలను పరిష్కరించేందుకు ముఖాముఖి చర్చించేందుకు సమావేశం ఏర్పాటు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సంక్షేమ పథకాలతో పాటు భాగస్వామ్యమౌతున్న ఉద్యోగులను అభినందిస్తూ వారి యొక్క అభిప్రాయాలను తెలుసుకునేందుకు ఆత్మీయ సమ్మేళనాన్ని నియోజక వర్గ స్థాయిలో నిర్వహించడం జరుగుతుందన్నారు. పట్టణం, ఐదు మండలాలకు చెందిన వారంతా ఈ సమావేశంలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

జగనన్న విద్యాకానుక కిట్లు పంపిణీ



దాచేపల్లి : మండలంలోని గామాలపాడు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో చదువుకుంటున్న విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లు బుధవారం పంపిణీ చేశారు. సర్పంచ్ జంగా సురేష్ చేతుల మీదుగా హైస్కూల్‌లో చదువుకుంటున్న విద్యార్థులందరూ కిట్లు అందించారు. ప్రభుత్వ పాఠశాలలను వేలకోట్లు ఖర్చు చేసి ప్రభుత్వం అభివృద్ధి చేసిందని, విద్యార్థులు చదువుకునేందుకు అన్ని వసతులు ప్రభుత్వం కల్పించిందని సర్పంచ్ సురేష్ చెప్పారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను ఉపాధ్యాయులు అందించాలని, విద్యతో పాటుగా క్రమశిక్షణ, విలువలు నేర్పించాలని ఉపాధ్యాయులకు ఆయన సూచించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ షేక్ ఆదాంసాహెబ్, ఉపసర్పంచ్ సయ్యద్ పెదహుస్సేన్, స్థానికులు చాప శేషయ్య, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

అప్లికేషన్ తెలుగులో ఉండాలంటూ వినతి

పిడుగురాళ్ల: దరఖాస్తు ఫారం తెలుగులో ఉండేలా చూడాలని తహసీల్దార్ చక్రవర్తికి పెదకొలిమి కిరణ్‌కుమార్ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కిరణ్‌కుమార్ మాట్లాడుతూ పట్టణంలోని మీ సేవా సెంటర్‌లో ఒక దరఖాస్తు ఫారం అడగ్గా అది ఇంగ్లిష్‌లో ఉంది, తెలుగులో లేదా అని మీ సేవా సెంటర్ నిర్వాహకుడిని అడగ్గా అతను లేదని తెలియజేశారని, మిరీ దీనిని ఎలా ఫిల్ చేసేది అని అడగ్గా రూ. 40 ఇస్తే మేమే ఫిల్ చేస్తామని చెప్పారు. ఇది కూడా గవర్నమెంట్‌కే చెందుతుందా అని అడగ్గా కాదు ఇది మేము ఫిల్ చేసినందుకు అని చెప్పారు. మరీ తెలుగులో ఎందుకు దరఖాస్తు ఫారం లేదు అని అడగ్గా గవర్నమెంట్‌ను అడుగు అని చెప్పడంతో వెంటనే తహసీల్దార్ కార్యాలయం వద్దకు వచ్చి తహసీల్దార్ చక్రవర్తికి వినతి పత్రం అందజేసినట్లు తెలియజేశాడు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేద్దాం

మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు

పిడుగురాళ్ల: ప్రజా సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించేవిధంగా కృషి చేద్దామని మున్సిపల్ కమిషనర్ ఎం. వెంకటేశ్వర్లు అన్నారు. పట్టణంలోని సత్యసాయి బాబా కల్యాణ మండపంలో వలంటీర్లు, గృహసారథులు, సచివాలయ సిబ్బందికి జగనన్న సురక్ష కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హాజరైన మున్సిపల్ వైస్ చైర్మన్‌లు కొమ్ముముక్కంటి, షేక్ జైలాబ్దిన్‌లు మాట్లాడుతూ వలంటీర్ తనకు కేటాయించిన ప్రతి ఇంటికి వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన యాప్‌లో అప్లికేషన్ నమోదు చేసుకోవాలని, దానిలో ఎవరికైతే ఏ సమస్య ఉందో ఆ సమస్యను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు అజ్మీర శారద, కొక్కెర శ్రీను, ఉన్నం ఆంజనేయులు, జూలకంటి శ్రీనివాసరావు, సచివాలయసిబ్బంది, వలంటీర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

ఇంటింటికీ జగనన్న సురక్ష పథకం అందేలా చూద్దాం

మాచర్ల రూరల్: అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ జగనన్న నవరత్నాలు అందించాలన్న లక్ష్యంతో ఏర్పాటు చేయనున్న జగనన్న సురక్ష పథకాన్ని విజయవంతం చేసేందుకు అన్ని శాఖాధికారులు సమష్టిగా పనిచేయాలని ఎంపీపీ బూడిద శ్రీనివాసరావు కోరారు. బుధవారం అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పేదలకు సంక్షేమ పథకాలందించి వారికి ఆర్థిక భరోసా ప్రతి ఒక్క పథకాన్ని అందించాలని, ఏ కారణం చేతనైనా పథకం అందలేదో తెలుసుకుని అర్హత ఉంటే ఖచ్చితంగావారికి అందేలా చూడాలని, జగనన్న సురక్ష పథకం ప్రతి ఇంటికి తీసుకెళ్ళాలని కోరారు. ఈ నేపథ్యంలో రెండు టీంలుగా అధికారులు జులై 1న కంభంపాడు, గన్నవరం, జులై 4న కంభంపాడు 2, కొత్తపల్లి, జులై 11న కొప్పునూరు, లచ్చమ్మబావి, 13న తాళ్ళపల్లి, కొత్తూరు, 15న పశువేముల, నాగులవరం, 18న ఎజె మడక, విజయపురిసౌత్ 1, 20న రాయవరం, విజయపురిసౌత్ 2, 22న చింతలతండ గ్రామాలలో ప్రజలను కలిసి అర్జీలను స్వీకరిస్తారన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి గబ్రూనాయక్, ఎంపీడీఓ వి కోటేశ్వరరావు, డిప్యూటీ తహసీల్దార్ బత్తుల వాణి, ఎఈ సురేంద్ర, పంచాయితీ కార్యదర్శులు పలువురు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ బూడిద శ్రీను, ప్రత్యేక అధికారి గబ్రూనాయక్

మాచవరం: ప్రజాసమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు చేపట్టనున్న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ యు.వి.వరప్రసాద్ తెలిపారు. ఈనెల 23న కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని, జులై 1 నుంచి ఆయా గ్రామాల్లోని సచివాలయాలను సందర్శించడం జరుగుతుందన్నారు. కార్యక్రమాల్లో కుల, ఆదాయ, నివాస, వివాహ, జనన, మరణ, ధృవీకరణ పత్రాలు, రెవెన్యూ సంబంధిత సమస్యలు, మ్యూటేషన్ లావాదేవీలు, పంట సాగు హక్కు కార్డులు, నూతన రేషన్ కార్డులు, నివేశిత స్థలాలు మ్యాపింగ్, తదితర అంశాల సర్వీసులపై అవసరతలను బట్టి మండల కమిటీకి అందజేయాల్సి ఉంటుందన్నారు. సేవలకు ఎలాంటి రుసుము లేదని, నేటి నుంచి వలంటీర్లు తమ పరిధిలోని గృహాలను సందర్శించి ప్రజా అవసరాలను గుర్తించాలని తెలియజేశారు. మండల అధికారులు, సచివాలయాల సిబ్బంది , వలంటీర్లు తప్పని సరిగా కార్యక్రమంలో పాల్గొనాలని తెలియజేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ ప్రసాద్

జగనన్న సురక్ష పై సమీక్ష సమావేశం

వెల్దుర్తి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష పథకం పై ఎంపీడీఓ ప్రసాద్ అధ్యక్షతన మండల స్థాయి అధికారులు, సిబ్బందితో సమీక్ష సమావేశం జరిగింది. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ నెల 23వ తేదీ నుంచి జులై 23వ తేదీ వరకు జరిగే జగనన్న సురక్ష పథకం పై గ్రామాల్లో తిరిగి నవరత్నాల పథకాలు సక్రమంగా అందుతున్నాయా లేదాని సిబ్బంది అడిగి తెలుసుకోవాలన్నారు. అర్హులై ఉండి పథకాలు రానివారుంటే వారిని గుర్తించి వారికి పథకాలు మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. మండలంలోని అధికారులను రెండు గ్రూపులుగా ఏర్పాటు చేసి ప్రతి గ్రామంలో ఇంటింటికి తిరిగి వివరాలు సేకరించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ కోటేశ్వరరావు నాయక్, డిప్యూటీ తహశీల్దార్ రాజశేఖర్‌నాయక్, వీఆర్ఓలు, పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

బడిఈడు పిల్లంతా బడిలోనే ఉండాలి

కార్మిక శాఖ అసిస్టెంట్ కమిషనర్ ధనలక్ష్మి



కార్మిక శాఖ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది

పిడుగురాళ్ల: బడి ఈడు పిల్లలంతా బడిలోనే ఉండాలి, బాల కార్మికులు కనిపించకుండా ప్రతి ఒక్కరు కృషి చేయాలని అసిస్టెంట్ కమిషనర్ జి. ధనలక్ష్మి తెలిపారు. పట్టణంలోని కార్మిక శాఖ కార్యాలయం వద్ద పల్నాడు సేవాధికార సంస్థ ఆదేశాలతో కార్మికశాఖ కమిషనర్ సహకారంతో పిడుగురాళ్ల మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు నిర్వహించే స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈసందర్భంగా కార్మిక శాఖ అసిస్టెంట్ కమిషనర్ మాట్లాడుతూ చిన్నారుల చేత వెట్టిచాకిరి చేయిస్తున్న సంస్థల యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు. అలాగే పిల్లల తల్లిదండ్రులకు కూడా తమ పిల్లలను పాఠశాలకు పంపించి విద్యను అందించేందుకు అందరు ముందుకు సాగాలని కోరారు. చిన్నారులందరు విద్యా వంతులు అయితే మంచి సమాజాన్ని ఏర్పాటు చేయడంతోపాటు దేశాభివృద్ధికి తోడ్పడే అవకాశం దొరుకుతుందని తెలిపారు. కార్యక్రమంలో పిడుగురాళ్ల సహాయ కార్మిక అధికారి నాగరాజ, జిల్లా సోషల్ వెల్ఫేర్ చైల్డ్ పాటెక్షన్ ఫోర్స్ అధికారి షేక్ అబ్దుల్ రసీద్, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ సబ్ ఇన్‌స్పెక్టర్ వైసీహెచ్ అల్లూరి రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ చంద్రశేఖర్, కమ్యూనిటీ హెల్త్ అధికారి వి. హర్షవర్ధన, అసిస్టెంట్ ఫ్యాక్టరీస్ ఇన్‌స్పెక్టర్ ఎంవీవీ సుబ్రహ్మణ్యం, పారా లీగల్ వలంటీర్ ఎస్‌వీ కోటేశ్వరరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సిబ్బంది జవాబుదారీతనంతో పనిచేయాలి

మాచర్ల రూరల్: ఉద్యోగులు ఎక్కడ పనిచేసినా జవాబుదారితనంతో పనిచేస్తూ ప్రజల, ప్రభుత్వ అధికారుల మన్ననలు పొందాలని ఎంపీడీఓ కోటేశ్వరరావు కోరారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ గన్నవరం నుంచి మోర్జంపాడుకు సిరిబోయిన జయశ్రీ బదిలీ పై వెళ్తున్న నేపథ్యంలో ఆమెను సన్మానించి మాట్లాడారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించి వారిని నిర్ణీత సమయంలో రెగ్యులర్ చేయటమే కాకుండా వారు కోరుకున్న చోటకి బదిలీలు చేయడం గొప్ప విషయమన్నారు. జయశ్రీ గన్నవరం గ్రామ సచివాలయంలో ప్రజలకు సకాలంలో సేవలందించి గ్రామ ప్రజల అభిమానాన్ని పొందడం పై ఆమెను అభినందించారు. ఈ సందర్భంగా జయశ్రీని, మండల సచివాలయ ఉద్యోగుల అధ్యక్షుడు అమరోజు అమరయ్య, కార్యదర్శులు వెంకటేశ్వర్లు, బాబు లాల్ నాయక్, డిజిటల్ అసిస్టెంట్లు ఆమెకు ఘనంగా వీడ్కోలు పలికారు.

జగనన్న ఆణిముత్యాలు మరింతగా రాణించాలి



విద్యార్థులకు ప్రసంశాపత్రాలను అందజేసి మాట్లాడుతున్న ఎంపీపీ బూడిద శ్రీను

విజయపురిసౌత్: జగనన్న ఆణిముత్యాలుగా ఎంపికైన విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత చదువుల్లో మరింతగా రాణించి ఉన్నత శిఖరాలు అదిరోహించాలని మాచర్ల ఎంపీపీ బూడిద శ్రీను అన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులను మరింత ప్రోత్సహించేందుకే జగనన్న ఆణిముత్యాల అవార్డు ఇస్తున్నట్లు తెలిపారు. ఈ ఏడాది పాఠశాలలో పదో తరగతిలో అత్యుత్తమ మార్కులు సాధించిన ముగ్గురు విద్యార్థులను ఎంపిక చేశారు. పదో తరగతిలో ప్రథమ స్థానంలో నిలిచిన ఆడెపు గాయత్రి, ద్వితీయ స్థానంలో నిలిచిన ఆడెపు భవ్యశ్రీ, తృతీయ స్థానంలో నిలిచిన చెన్నా అక్షరలకు ప్రభుత్వ ఆదేశాల మేరకు జగనన్న ఆణిముత్యాలు అవార్డు కింద నగదు, ప్రసంశా పత్రాలను అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో మాచర్ల ఎంపీడీఓ కోటేశ్వరావు, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి తోటకూర పరమేశ్వరావు, పాఠశాల హెచ్ఎం బండి గోవిందయ్య, పీఎంసీ చైర్మన్ ధర్మవరపు సుబ్రహ్మణ్యం, ఉపాధ్యాయులు ఆనంద్‌బాబు, కోట్ల కోటేశ్వరావు, మల్లిఖార్జున, రమేష్, లక్ష్మి, విజయలక్ష్మి, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అధిక ధరలకు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు

ఏడీఏ జగదీశ్వర్‌రెడ్డి



మాట్లాడుతున్న మాచర్ల సహాయ వ్యవసాయ సంచాలకులు జగదీశ్వర్‌రెడ్డి

రెంటచింతల: రైతులకు ఎరువులు, పురుగు మందులను అధిక ధరలకు విక్రయిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మాచర్ల వ్యవసాయ సహాయ సంచాలకులు వి.జగదీశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక మండల వ్యవసాయ కార్యాలయంలో ఎరువులు, పురుగు మందుల షాపుల నిర్వాహకులకు నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. షాపుల్లో ఉన్న ప్రతి ఎరువుకు, పురుగు మందులకు ఖచ్చితంగా పీసీలు కలిగి ఉండాలన్నారు. ఎప్పటికప్పుడు షాపుల్లో ఉన్న ఎరువులు, పురుగు మందుల వివరాలు, క్రయ, విక్రయాలకు సంబంధించి సమాచారం రికార్డుల్లో నమోదు చేయాలన్నారు. రైతులు కొనుగోలు చేసిన ఎరువులకు, పురుగు మందులకు ఇచ్చే బిల్లులో తేదీ, బ్యాచ్ నంబర్, లాట్ నంబర్ నమోదు చేసి ఇవ్వాలన్నారు. షాపులో స్టాక్ వివరాల రికార్డు ఎప్పుడూ అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో మండల వ్యవసాయ అధికారి బోయపాటి బ్రహ్మారెడ్డి, వివిధ గ్రామాల ఎరువులు, పురుగు మందుల షాపుల నిర్వాహకులు పాల్గొన్నారు.

దుక్కులకు అనుకూలమైన సమయం

రెంటచింతల: సాగు భూముల్లో దుక్కులు దున్నుకునేందుకు ఇదే అనుకూలమైన సమయమని మండల వ్యవసాయాధికారి బోయపాటి బ్రహ్మారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం కురిసే వర్షాలను మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. దుక్కులను వాలుగా లోతుగా దున్నుకోవాలని లేనిఎడల వర్షం నీటికి భూమి కోతకు గురయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. వాలుకు అడ్డంగా లోతు దుక్కుల వల్ల వ్యవసాయభూమి ఎక్కువ తేమను కలిగి ఉండే సామర్థ్యం ఉంటుందని, ప్యూపాదశలో ఉన్న గులాబి రంగు పురుగులు చనిపోతాయని దీంతో రైతులకు పంట నష్టం ఎక్కువగా ఉండదన్నారు. లోతుగా దున్నిన భూమిలో మొక్కల వేర్లు లోతుగా పాదుకుని వెళ్లడం వల్ల దిగుబడి పెరిగే అవకాశం ఉందన్నారు. పంటపొలాల్లో పంటలు వేయడం వల్ల చీడపీడలు భూమిలో ఉంటాయని ఈ సమయంలో దుక్కులు దున్నడం వల్ల భూముల్లో ఉండే క్రిమికీటకాలతోపాటు చీడపీడలు చనిపోతాయన్నారు. వేసవిలో దుక్కులు దున్నుకోవడం వల్ల అయ్యే ఖర్చు కన్నా దానిద్వారా రైతుకు చేకూరే ప్రయోజనమే ఎక్కువగా ఉంటుందన్నారు.

తొలకరి వర్షం ప్రారంభం

దుర్గి: ఆలస్యమైన నైఋతి ఋతుపవనాలు కదలిక మొదలైంది. బుధవారం మండల వ్యాప్తంగా తొలకరి జల్లులు కురిశాయి. రైతులు గత కొన్ని రోజులుగా వర్షం కోసం ఎదురుచూస్తూ విత్తనం నాటడం కోసం పడిగాపులు కాశారు. ఎట్టకేలకు ఋతుపవనాల ప్రభావంతో వర్షం జల్లులు ప్రారంభం కావడంతో రైతుల మోములో ఆనందం వ్యక్తమౌతుంది. ఖరీఫ్ పంటలు ముమ్మరంగా సాగుకు ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. వాతావరణం చల్లబడడంతో ప్రజలు, వృద్ధులు, మహిళలు, పిల్లలు, ఉపశమనం పొందారు. రానున్న రోజుల్లో మరింతగా నైఋతి ఋతుపవనాలు విస్తరించి వర్షాలు పూర్తిస్థాయిలో అందుకుంటాయని ఆశాభావాన్ని వ్యక్తం చేస్తున్నారు.

క్విజ్ పోటీలతో మేదస్సుకు పదును

గురజాల : క్విజ్ పోటీలు మన మేదస్సుకు పదును పెడుతాయని యూనియన్ బ్యాంక్ మేనేజర్ సాగర్ బాబు అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు బ్యాంక్ రంగాలపై క్విజ్ పోటీలు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నతనం నుంచే చిన్నారులు తమ మేధస్సుకు పదును పెట్టాలన్నారు. ప్రస్తుతం పోటీ ప్రపంచంలో అందరి కన్నా ముందుగా ఆలోచించే మనస్తత్వం ఉండాలంటే మెదడు చురుకుగా పని చేయాలన్నారు. అనంతరం క్విజ్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. 26వ తేదీన జిల్లా స్థాయిలో పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బి పూర్ణచంద్రరావు, పి సుదర్శనరావు, ఎస్ జాన్సీ, సాగర్‌బాబు, రామారావు తదితరులున్నారు.

యోగాతోనే పరిపూర్ణమైన ఆరోగ్యం



కారెంపూడి జెడ్పీ హైస్కూల్లో యోగా చేస్తున్న అభ్యాసకులు



ఏసీఆర్ డిగ్రీ కళాశాలలో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు

దాచేపల్లి : యోగాతో ఆరోగ్యం పదిలంగా ఉంటుందని నగర పంచాయతీ చైర్మన్ కొప్పుల సుబమ్మ సాంబయ్య అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నారాయణపురంలోని యోగా విజ్ఞాన కేంద్రంలో బుధవారం నిర్వహించారు.

యోగా చేయడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించి యోగాసనాలు వేయించారు. ఈ సందర్భంగా చైర్మన్ సుబ్బమ్మసాంబయ్య మాట్లాడుతూ.. యోగా చేయడం ద్వారా దీర్ఘకాలిక వ్యాధుల నుంచి దూరం కావచ్చునని, యోగా చేయడం ఆరోగ్యకరంగా ఉంటామన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బుర్రి విజయ్‌కుమార్‌రెడ్డి, స్థానికులు అంబటి చలమయ్య, తమ్మినేని అక్కిరాజు, మురళీ, గాదె రామకృష్ణారెడ్డి, కొగంటి శివన్నారాయణ, యర్రంశెట్టి గోపినాథ్, తలతల కృష్ణారెడ్డి, నర్రా పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

పిడుగురాళ్ల: పట్టణ, మండలంలో యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని లయన్స్ క్లబ్ ఆఫ్ పిడుగురాళ్ల ఆధ్వర్యంలో క్లబ్ సభ్యులు పట్టణంలోని స్కాలర్స్ డిగ్రీ కాలేజీలో విద్యార్థులతో యోగా డే గురించి తెలియజేసి వారితో యోగా సనాలు వేయించారు. కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపల్ ఆవుల జనార్ధన్, ఆర్ట్ ఆఫ్ లివింగ్ తాళ్లూరి సత్యం, క్లబ్ అధ్యక్షుడు తంగుటూరి సతీష్, సెక్రటరీ గుండా నారాయణరావు, కోడూరు కాశీ శంకర్, యడవల్లి ఏడుకొండలు, తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా మండలంలోని తుమ్మలచెరువు టోల్ ప్లాజా వద్ద నామ్ ఎక్స్‌ప్రెస్ లిమిటెడ్ ద్వారా క్యూబ్ రూట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహించారు.

రెంటచింతల: ప్రతిరోజు యోగాసనాలు వేయడం ద్వారా పరిపూర్ణమైన ఆరోగ్యం పొందవచ్చునని బ్రహ్మకుమారీస్ రాజయోగ ధ్యానకేంద్రం హైదరాబాద్ ప్రతినిధి రాజయోగిని అనిత సిస్టర్ అన్నారు. బుధవారం ప్రపంచ యోగా దినోత్సవం పురస్కరించుకుని రెంటచింతల మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ప్రజా ప్రతినిధులు, అధికారులతో ఆమె యోగా ఆసనాలను వేయించి యోగా ప్రముఖ్యతను వివరించారు. యోగా అనేది భారతదేశంలో ఉద్భవించిన పురాతన భౌతిక, మానసిక, ఆధ్యాత్మిక అభ్యాసనం అన్నారు. యోగా చేయడం ద్వారా మీకు మానసిక, శారీరక ఆరోగ్యానికి ఎంతో ప్రయోజనం చేకూరుస్తుందన్నారు. సుఖాసనం, పద్మాసనం, వజ్రాసనం, గోముఖాసనం, వృక్షాసనం, హలాసనం, చక్రాసనం, శవాసనంతో పాటు సూర్య నమస్కారం ప్రతిరోజు చేయడం వలన ప్రతి ఒక్కరూ శారీరకంగాను, మానసికంగాను దృఢంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ దాసరి చౌడేశ్వరి, ఎంపీడీఓ యల్లా మహాలక్ష్మి, ఈవోపీఆర్డీ రామచంద్రరావు, కార్యాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కారెంపూడి: ప్రతి రోజు యోగా చేస్తూ ఆహార నియమాలు పాటిస్తూ ఆరోగ్యంగా జీవించవచ్చని వైద్యులు డాక్టర్ ఎం సత్యనారాయణ, డాక్టర్ ఎస్ వసంతరావులు చెప్పారు. ప్రపంచ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని కారెంపూడిలో యోగా అభ్యాసకులు డాక్టర్లను సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరోగ్యంగా జీవించడానికి నడకతో పాటు యోగా చేయడం అందరూ అలవాటు చేసుకోవాలని సూచించారు. బ్రహ్మానాయుడు జెడ్పీ హైస్కూల్లో 13 ఏళ్లగా ఉచితంగా నడుస్తున్న యోగా సెంటర్ అభ్యాసకులు ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ఇదిలా ఉంటే పలు ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులచే ఉపాధ్యాయులు పీఈటీ, పీడీలు యోగాసనాలు చేయించారు. చదువుపై మరింత ధ్యాస పెట్టడానికి యోగాసాధన బాగా ఉపయోగపడుతుందని ఒప్పిచర్ల పీడీ రత్తయ్య విద్యార్థులకు సూచించారు.

మానసిక ఒత్తిడి, రుగ్మతల యోగా నివార్యం

విజయపురిసౌత్: మానసిక ఒత్తిడి, రుగ్మతల నివారణకు యోగా అనివార్యమని ఏసీఆర్ డిగ్రీ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ పి రామకృష్ణ అన్నారు. బుధవారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని కళాశాలలో విద్యార్థులు నిర్వహించిన యోగా కార్యక్రమంలో ఆయన పాల్గొని మట్లాడారు. షుగర్, బీపీ, కీళ్ళనొప్పులు అజీర్ణ శక్తి, ఇతర వ్యాధుల నివారణకు యోగా విద్య ఉపకరిస్తోందన్నారు. అనంతరం విద్యార్థులచే సూర్య నమస్కారాలు, అర్ధ చక్రాసనం, గోముఖాసనం, సర్వాంగచక్రాసనం, శీర్షాసనం తదితర 40 ఆసనాలను విద్యార్థులతో ఆసనాలను వేయించి వాటి ఉపయోగాలను వివరించారు. యోగా ప్రతి రోజూ అభ్యసనం చేసినట్టుయితే ఏకాగ్రత పెరిగి తాము కోరుకున్న లక్ష్యాలను సులభతరంగా సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ వైఎస్ ఎస్ చౌదరి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఎస్‌కె మహమ్మద్ బాష, ఎన్‌సీసీ ఏఎన్ఓ డి విజయ కుమార్, పీడీ సిహెచ్ చంద్రశేఖర్, విద్యార్థులు పాల్గొన్నారు.

మాచర్ల: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని మాచర్ల మండల న్యాయ సేవా కమిటీ ఆధ్వర్యంలో కోర్టు ప్రాంగణంలో నిర్వహించారు. బుధవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో మాచర్ల కోర్టు అదనపు జూనియర్ సివిల్ జడ్జి శారద మాట్లాడుతూ యోగా అనేది ప్రతి మనిషికి ముఖ్యమన్నారు. దైనందిన జీవితంలో ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండడానికి యోగా చేయాలన్నారు. యోగా చేయడం వల్ల అనేక వ్యాధులు నివారించవచ్చునని న్యాయవాది జీ వెంకటేశ్వర్లు (జీవి), సభ్యులు మెట్టు గోవిందరెడ్డి యోగా చేసి అవగాహన కల్పించారు. న్యాయవాదులు రామునాయక్, బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎస్ వెంకటేశ్వర్లు, గౌస్‌పాషా, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

గురజాల : మానవ జీవితంలో యోగాను దైనందిక ప్రక్రియలుగా ప్రాధాన్యత ఇవ్వాలని 10వ అదనపు జిల్లా జడ్జి జి వెంకటేశ్వర్లు సూచించారు. స్థానిక కోర్టు భవనంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం యోగా ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవ శరీర అంతర్భాగాల పనితీరు వాటిలో యోగా ప్రాముఖ్యతను వివరించారు. ప్రాణాయామం చేయడం వల్ల ఆరోగ్యంగా ఉంటామన్నారు. అనంతరం సబ్ జైల్‌లో ఖైదీలకు యోగా ప్రాముఖ్యత గురించి వివరించారు. అనంతరం యోగాసనాలు చేసి వాటి గురించి వివరించారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి బిఎల్‌వి శేషాద్రి, జూనియర్ సివిల్ జడ్జి షర్మిల, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, న్యాయవాదులు చీతిరాల కోటేశ్వరరావు, మెడికల్ అఫీసర్ సుధీర్, సబ్‌జైల్ సూపరింటెండెంట్ సుబ్బారెడ్డి పాల్గొన్నారు.



యోగా ప్రాముఖ్యతను వివరిస్తున్న రాజయోగిని అనిత సిస్టర్



లయన్స్ క్లబ్ ఆఫ్ పిడుగురాళ్ల ఆధ్వర్యంలో విద్యార్థులతో యోగా చేస్తున్న నిర్వాహకులు



యోగా గురించి వివరిస్తున్న నిర్వాహకులు

పలు సంస్థల ఆధ్వర్యంలో యోగా డే

మాచర్ల: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని పలు సంస్థలు, పాఠశాలలు, కళాశాలల్లో యోగా దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. పట్టణంలోని రామకృష్ణ సేవా సమితి, వీఎస్ఆర్ ఫౌండేషన్, సొసైటీ కాలనీలోని సత్యసాయి విద్యా మందిర్, ఆయా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, ఆయా కళాశాలల్లో ప్రిన్సిపాళ్ళు చక్రధర్ డిగ్రీ కళాశాలలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కుర్రి సాయి మార్కొండారెడ్డి, డైరెక్టర్ మహేష్‌రెడ్డి ఆధ్వర్యంలో యోగా నిర్వహించారు.

జాతీయ సేవా భూషణ పురస్కారం అందుకున్న గరికపాటి



శంకర్‌రావును సన్మానిస్తున్న లిటిల్ చాంప్స్ అకాడమీ ఆఫ్ ఇండియా చైర్మన్

పిడుగురాళ్ల: సామాజిక సేవారంగంలో విశేష కృషి చేస్తూ పట్టణ శివారులోని కొండమోడులో 18 సంవత్సరాలు పాటు దీనమ్మ అండ్ రూరల్ డెవలప్ మెంట్ సొసైటీ నిర్వహిస్తున్న చైర్మన్ గరికపాటి శంకర్‌రావును బాపట్ల ఎన్జీఓ హాల్‌లో లిటిల్ చాంప్స్ అకాడమీ ఆఫ్ ఇండియా చైర్మన్ బుచ్చేశ్వరరావు సన్మానించారు. ఈ సందర్భంగా లిటిల్ చాంప్స్ అకాడమి ఆఫ్ ఇండియా చైర్మన్ బుచ్చేశ్వరరావు మాట్లాడుతూ నిరుపేద కుటుంబం నుంచి వచ్చిన శంకర్‌రావు ఎంతో మంది పిల్లలకు సేవ చేయడం ఎంతో ఆనందించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో బాపట్ల జిల్లా శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ కె. ఉమా, గ్రేస్ పౌండేషన్ డైరెక్టర్ కె. శిలవరాజు, బాపట్ల సీఏ కృష్ణయ్య, ఏపూరి బ్రదర్స్ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ బాబురావు, యస్ఎస్ఐఆర్‌డి డైరెక్టర్ రవి ప్రదీఫ్ శాంతి, రూరల్ డెవలప్మెంట్ సొసైటీ చైర్మన్ రాజారావు ఉన్నారు.